సాక్షి నిర్మల్

7

మంగళవారం । 17 । సెప్టెంబర్ । 2024

గరిష్ఠం/కనిష్ఠం
32.0 /23.0

వాతావరణం

వాతావరణం పొడిగా ఉంటుంది. ఆకాశం పాక్షికంగా మేఘావృతమవుతుంది. ఉష్ణోగ్రతలు స్వల్పంగా పెరుగుతాయి.



'సాయుధ' స్మృతులు..

రజాకార్ల అకృత్యాలు.. నిజాం నిరంకుశత్వాన్ని ఎదిరించిన ఈ ప్రాంత యోధులు చిరస్మరణీయులు. ఉమ్మడి జిల్లాలోని పలు ప్రాంతాలు సాయుధ పోరాట కీలక ఘట్టాలకు నిలువెత్తు సాక్ష్యాలుగా నిలుస్తున్నాయి. - 8లో

దళాలను ఏర్పాటు చేసిన.. దాజి శంకర్



భూస్వాములు, పెట్టుబడిదారుల కారణంగా పేదలు పడుతున్న ఇబ్బందులను గుర్తించిన దాజి శంకర్ తనకున్న 350 ఎకరాలను వారికి పంచి సామాజిక బాధ్యతను చాటుకున్నారు. రజాకార్లు సాగించిన వెట్టిచాకిరీతో విసుగుచెందిన ఆయన ఉద్యమబాట పట్టారు. కుచులాపూర్, తాంసి, తలమడుగు, ఆదిలాబాద్ మండలాల్లో పర్యటిస్తూ ప్రత్యేక దళాలను ఏర్పాటు చేశారు. నిజాం పాలకుల నిఘా పెరగడంతో అజ్ఞాతంలోకి వెళ్లిపోయారు. రెండేళ్ల పాటు అజ్ఞాతం నుంచే ప్రజా పోరాటాన్ని నడిపించారు. 1947లో అరెస్టయి జైలుకు వెళ్లిన ఆయన 1952లో విడుదలయ్యారు. అదే ఏడాది జరిగిన ఎన్నికల్లో ఎమ్మెల్యేగా పోటీ చేసి విజయం సాధించారు.

ప్రజల్లో చైతన్యం రగిల్చిన.. రాంకిషన్ శాస్త్రీ



నల్గొండ జిల్లాలో ప్రభుత్వ ఉపాధ్యాయుడిగా పనిచేసిన రాంకిషన్ శాస్త్రీ సీపీఐ భావజాలానికి ఆకర్షితుడై ఆ పార్టీలో చేరారు. ఆయన్ను ఆదిలాబాద్ జిల్లా ఇన్చార్జీగా నియమించారు. 1941లో జిల్లాకు వచ్చిన ఆయన పార్టీ సభ్యత్వ నమోదును ప్రారంభించారు. కాస్తాల రాంకిష్టు, దాజీ శంకర్, వన్నెల ఎల్లన్న, సదాశివ్ వంటి వారితో ఓ ప్రత్యేక దళాన్ని ఏర్పాటు చేశారు. రైతుల నుంచి భూములను లాక్కుని కౌలు సైతం చెల్లించని రజాకార్ల వైఖరిని ఎండగట్టేలా రైతాంగ పోరాటానికి శ్రీకారం చుట్టారు. రాత్రి పూట ప్రత్యేక పాఠశాలను నిర్వహిస్తూ ప్రజలను చైతన్యవంతం చేశారు. 1948లో ప్రస్తుత భీంపూర్ మండలం బెల్సారీ రాంపూర్‌లో అరెస్టయిన ఆయన 1952లో జైలు నుంచి విడుదలయ్యారు.

వెట్టిచాకిరీని వ్యతిరేకించిన.. కాస్తాల రాంకిష్టు



నిజాం పాలనలో సాగిన వెట్టిచాకిరీ, పీడిత వ్యవస్థతో ప్రజలు పడుతున్న ఇబ్బందులను గుర్తించిన కాస్తాల రాంకిష్టు అందుకు వ్యతిరేకంగా పోరుబాట పట్టారు. ఉద్యమంలో కలిసి వచ్చేలా ప్రజల్లో చైతన్యం రగిల్చారు. మహారాష్ట్రలోని చెనక గ్రామంలో నాడు ఉద్యమకారులకు శిక్షణ ఇచ్చేవారు. ఈ వ్యవహారాలను పర్యవేక్షించడంలో ఆయన కీలకపాత్ర పోషించారు. భూస్వామ్య కుటుంబానికి చెందిన రాంకిష్టు రజాకార్లు సాగించిన హింసాకాండకు చలించి ఉద్యమబాట పట్టారు. కమ్యూనిస్టు భావజాలానికి ఆకర్షితుడైన ఆయన సీపీఐలో చేరారు. ఆ పార్టీ ముఖ్యనేతలు రాంకిషన్ శాస్త్రీ, దాజీ శంకర్ నాయకత్వంలో ప్రజలను సంఘటితం చేశారు. రెండేళ్ల జైలు జీవితం గడిపిన ఆయన విడుదలయ్యాక ఆదిలాబాద్ ఎమ్మెల్యేగా ఎన్నికయ్యారు.

ప్రజలను జాగృతం చేసిన.. ఎల్లన్న



తాంసి మండల కేంద్రానికి చెందిన వన్నెల ఎల్లన్న కళాకారుడు. సీపీఐ భావజాలానికి ఆకర్షితుడై ఆ పార్టీలో చేరారు. రజాకార్లు సాగిస్తున్న దమనకాండకు వ్యతిరేకంగా ప్రజలను జాగృతం చేయడంలో ముఖ్య పాత్ర పోషించారు. గ్రామ గ్రామాన తిరుగుతూ తన ఆటపాటల ద్వారా జనంలో ఉద్యమస్ఫూర్తిని రగిలించారు. జైలు జీవితం సైతం గడిపారు.

పోరాట స్ఫూర్తిని చాటేలా..

తెలంగాణ సాయుధ రైతాంగ పోరాటంలో యోధులుగా ప్రజల్లో చిరస్మరణీయులుగా నిలిచిపోయారు. వారి పోరాటాలకు గుర్తుగా కమ్యూనిస్టు పార్టీ ఆధ్వర్యంలో ప్రత్యేక స్తూపాలను నిర్మించారు. కాలనీలను సైతం ఏర్పాటు చేశారు. కలెక్టరేట్‌లో పోరాట యోధుల పేర్లతో కూడిన ప్రత్యేక శిలాఫలకం వారి త్యాగాలకు గుర్తుగా నిలుస్తోంది. ఇక కాస్తాల రాంకిష్టు పేరిట కేఆర్‌కే కాలనీ, దాజీ శంకర్ పేరిట పెండల్వాడలో ఓ కాలనీని ఏర్పాటు చేశారు. అలాగే తాంసి మండలం ఈదుల్లాసావర్గాంలో దాజీ శంకర్, తిర్పెల్లి శ్మశానవాటికలో కస్తాల రాంకిష్టు, భుక్తాపూర్‌లో రాంకిషన్ శాస్త్రీ స్తూపాలు వారి చరిత్రకు సజీవసాక్ష్యాలుగా నిలుస్తున్నాయి.

సాయుధ యోధులకు సలాం

- నిజాం దమనకాండను ఎదిరించిన ఉమ్మడి జిల్లా వీరులు
- తెలంగాణ ప్రాంత విముక్తే లక్ష్యంగా పోరాటం





కలెక్టరేట్‌లోని సాయుధ పోరాటయోధుల స్తూపం



ఆసిఫాబాద్ సమరయోధులకు పంజాబ్ రెజిమెంట్ మేజర్ పీస్ గుహాన్ అందించిన ధ్రువపత్రం

యావత్ దేశం స్వాతంత్య్ర స్వేచ్ఛా వాయువులను పీలుస్తుంటే నిజాం ఏలుబడిలోని తెలంగాణ ప్రాంతంలో మాత్రం రజాకార్ల దమనకాండ సాగింది. ప్రజలను బానిసలుగా మార్చిన రజాకార్లు హింసించడంతో పాటు మహిళలపై అకృత్యాలకు ఒడిగట్టారు. చేతికందిన పంటలను పెత్తందార్లు కొల్లగొట్టారు. దేశ్‌ముఖ్‌లు, జాగీర్దార్లు, భూస్వాములు ప్రజలతో ఊడిగం చేయించుకుని శ్రమదోపిడీ చేశారు. ఇలాంటి ఘటనలతో విసుగు చెందిన ఎంతో మంది పోరాటయోధులు తిరుగుబావుటా ఎగురవేశారు. భూమి కోసం.. భుక్తి కోసం.. రాచరిక పాలన విముక్తి కోసం పోరుబాట పట్టారు. తమ ప్రాణాలు సైతం లెక్క చేయకుండా తెలంగాణ ప్రాంత విముక్తే లక్ష్యంగా పోరాడారు. రజాకార్ల అణచివేత, నిర్బంధాలు, జైలు శిక్షలకు వెన్నుచూపకుండా ధైర్యంగా ముందుండి వారు సాగించిన సాయుధ పోరాటం చరిత్రకు సజీవసాక్ష్యంగా నిలుస్తోంది. నిజాం ఆగడాలకు వ్యతిరేకంగా పోరాడటంతో పాటు భూస్వాములు, పెట్టుబడిదారుల చేతుల్లో ఉన్నటువంటి వేలాది ఎకరాల భూములను పేదలకు పంపిణీ చేసిన ఎంతో మంది పోరాటయోధులు తమ పేర్లను చరిత్రపుటల్లో లిఖించుకున్నారు. – కైలాస్‌నగర్

స్వచ్ఛంద సిపాయిలు



నిజాంకు వ్యతిరేకంగా పోరాడిన ఆసిఫాబాద్ యోధులు(ఫైల్)

ఆసిఫాబాద్: నిజాం నిరంకుశ పాలనకు వ్యతిరేకంగా సాగిన సాయుధ పోరాటంలో ఆసిఫాబాద్‌కు చెందిన సామాన్యులు సైతం స్వచ్ఛందంగా సిపాయిలుగా మారారు. పట్టణానికి చెందిన బోనగిరి వెంకటేశం, తాటిపెల్లి తిరుపతి, చీల శంకర్, చీల విఠల్, ఏకబిల్వం నాగేంద్రయ్య, ఖాడ్రే శంకర్, రాంసింగ్, రేవయ్య, తాటిపెల్లి తిరుపతి, ఏకబిల్వం శంకరయ్య, చందావార్ విఠల్, చిలుకూరి సీతారాం, జగన్నాథ్, తదితరులు మహారాష్ట్రలోని చాందాలో ఏడాదిపాటు సాయుధ శిక్షణ పొందారు. వీరికి ఆసిఫాబాద్‌కు చెందిన రాంచందర్ రావు పైకాజీ, సుబ్బ బాబురావు, దండనాయకుల గోపాల్‌కిషన్‌రావు, వామన్‌రావు వైరాగరే, ప్రభాకర్‌రావు మసాదే సహకరించారు. శిక్షణ తర్వాత భారత సైనిక దళాలకు అండగా ఉంటూ వీరూర్ రైల్వేస్టేషన్ విధ్వంసం ఘటనలో పాల్గొన్నారు. అప్పటి కేంద్ర హోంశాఖ మంత్రి వల్లభాయ్ పటేల్ 1948 సెప్టెంబర్ 13న పోలీస్‌యాక్షన్ ప్రకటించడంతో మహారాష్ట్ర నుంచి సైనిక బలగాలు పది యుద్ధ ట్యాంకులు, పది ట్రక్కులు, వందలాది మంది సైనికులతో కలిసి ఆసిఫాబాద్ వైపు సాగాయి.

పోరు సాగిందిలా..

1948 సెప్టెంబర్ 13న భారత సైన్యం పోలీస్ యాక్షన్ ప్రకటించింది. చంద్రాపూర్, బల్లార్షా, దాభా(ఉపక్యాంపు), సిరొంచా క్యాంపుల నుంచి సాయుధయోధులు భారత సైన్యంతో కలిసి నిజాం పోలీసులు, రజాకార్లపై విరుచుకుపడేందుకు సిద్ధమయ్యారు. భారత సైన్యం హైదరాబాద్ సంస్థానంలోకి ప్రవేశించకుండా రాజురా సమీపంలోని రైల్వేవంతెనను పేల్చేందుకు రజాకార్లు కుట్ర పన్నారు.

- 14న రాత్రి 11 గంటలకు రైల్వే వంతెన పేల్చివేత ప్రయత్నాలను సమరయోధులు గుర్తించారు. అర్ధరాత్రి 12గంటలకు కొరియర్ వ్యవస్థ ద్వారా మిలటరీకి సమాచారం అందించారు. తెల్లవారుజామున 2 గంటల ప్రాంతంలో విద్రోహులపై మిలటరీ దాడి చేయగా.. రజాకార్లు హతమయ్యారు. వేకువజామున 3 గంటలకు వీరూర్ రైల్వేస్టేషన్‌పై ఆసిఫాబాద్‌కు చెందిన బోనగిరి వెంకటేశం, మరో ఆరుగురు దాడి చేశారు. వెంకటేశం కాలికి బుల్లెట్ గాయమైంది.
- 15న తెల్లవారుజామున 4 గంటలకు దాబా మీదుగా మరో మిలటరీ క్యాంపు బయలుదేరింది. సాయుధ పోరాట వీరులు పెన్‌గంగ సరిహద్దులోని లోనవెల్లి నాకాపై దాడి చేయడంతో వారికి మార్గం సుగమమైంది. రాత్రి 10 గంటలకు ఆసిఫాబాద్ సమీపంలోని బుజల్‌ఘాట్ వంతెనను రజాకార్లు పేల్చివేశారు. స్థానికులు ఈ వంతెనపై తాత్కాలిక మార్గం ఏర్పాటు చేసుకున్నారు.
- 16న అర్ధరాత్రి దాటాక సిరొంచా నుంచి వచ్చిన మిలటరీ, స్థానికులు బెజ్జూర్ ఔట్‌పోస్టుపై దాడి చేసి స్వాధీనం చేసుకున్నారు. తెల్లవారుజామున దహెగాం సమీపంలో పెసరకుంట వద్ద రజాకార్లపై దాడి చేశారు. ఈ ఘటనలో 19 మంది మృతి చెందారు. అనంతరం బీబ్రా పోలీస్ స్టేషన్‌పై దాడి చేసి స్వాధీనం చేసుకున్నారు. ఇదేరోజు పదుల సంఖ్యలో స్వాతంత్య్ర సమరయోధులను ఆసిఫాబాద్ జిల్లా జైలులో పెట్టారు.
- 17న హైదరాబాద్ సంస్థానం ఇండియన్ యూనియన్‌లో విలీనమవుతున్నట్లు నిజాం ప్రకటించడంతో జైలులోని సమరయోధులు, ఇతర ఖైదీలతో కలిసి బయటకు వచ్చారు. నాటి పోరాటంలో పాల్గొన్న వారిని భారత ప్రభుత్వం స్వాతంత్య్ర సమరయోధులుగా గుర్తించింది.

విముక్తి కోసం పోరు!

- ఉమ్మడి జిల్లాలో అనేక పోరాటాలు
- నేడు 'ప్రజా పాలన దినోత్సవం'



నిర్మల్-ఎల్లపెల్లి దారిలో వెయ్యిమంది అమరుల స్మారకస్తూపం

సాక్షి ప్రతినిధి, మంచిర్యాల: దేశానికి 1947 ఆగస్టు 15న స్వాతంత్య్రం వచ్చినా.. తెలంగాణ(నిజాం రాజ్యం)లో మాత్రం 1948 సెప్టెంబర్ 17వరకు రాచరిక పాలన సాగింది. భారతదేశంలో విలీనానికి నిజాం రాజు వ్యతిరేకించగా.. దేశ సైన్యం రంగంలోకి దిగింది. మరోవైపు రజాకార్లపై సాయుధ పోరుబాట సాగింది.కమ్యూనిస్టులతోపాటు ప్రజా సంఘాలు, నాయకులు నాటి ప్రజావ్యతిరేక పాలనపై పోరాటం సాగించారు. ఉమ్మడి జిల్లాలో స్వేచ్ఛ, భూమి, భుక్తి, విముక్తి కోసం ఉద్యమాలు సాగాయి. తొలినాళ్లలో కుమురంభీం గిరిజనులకు జరిగే అన్యాయాలపై నిజాంపై తిరుగుబాటు చేశారు. తర్వాత ఆ స్ఫూర్తి సాయుధ పోరాటం వరకు కొనసాగింది. నాటి పోరాటాల ఫలితమే నేటి తెలంగాణ ప్రజాస్వామ్య పాలన. రాష్ట్ర ప్రభుత్వం సెప్టెంబర్ 17న ప్రజాపాలన దినోత్సవంగా నిర్వహించాలని నిర్ణయించింది. ఈ మేరకు ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా కలెక్టరేట్లలో మంగళవారం జాతీయ పతాకాన్ని ఆవిష్కరిస్తారు.

మరో జలియన్‌వాలా బాగ్

దేశ చరిత్రలో 1919లో ఏప్రిల్ 13న పంజాబ్‌లోని అమృత్‌సర్‌లో జరిగిన జలియన్‌వాలా బాగ్ ఘటన మరువలేనిది. శాంతియుతంగా సమావేశమైన వందలాది భారతీయులపైకి నాటి బ్రిటీష్ సైన్యం తుపాకీ ఎక్కుపెట్టి ప్రాణాలు తీసింది. స్వాతంత్య్ర పోరాటంలోనే మరువలేని దుర్ఘటన అయితే ఇదే తరహాలో 1860 ఏప్రిల్ 9న పూర్వపు ఆదిలాబాద్ జిల్లా నిర్మల్ శివారు ఎల్లపల్లి దారిలో మర్రిచెట్టుకు విప్లవ పోరాట యోధుడు గిరిజన ముద్దు బిడ్డ రాంజీ గోండుతో సహా వెయ్యి మందిని నాటి బ్రిటీష్ సైన్యం నిర్దాక్షిణ్యంగా ఉరి తీసింది.

రాంజీగోండు పోరాటం

1857లో గోండువీరులకు రొహిల్లాల దండు, దక్కనీలు, మరాఠాలతో కలసి, రొహిల్లాల సర్దార్ హజీతో కలిసి రాంజీ గోండు ఉమ్మడి శత్రువులపై పోరాడారు. నిర్మల్ కేంద్రంగా సాగుతున్న పోరాటం అణచివేతకు బల్లారి 47వ నేషనల్ ఇన్‌ఫ్రాంట్రిని పంపించారు. కల్నల్ రాబర్ట్ ఆర్మీ దళంపై రాంజీసేన సాగించిన గెరిల్లా పోరులో రెండుసార్లు దెబ్బతింటుంది. దీంతో ఆయనపై కుట్ర పన్ని రాంజీని దొంగదెబ్బ తీశారు. నిర్మల్ శివారు ఎల్లపెల్లి దారిలో ఊడలు దిగిన పెద్ద మర్రిచెట్టుకు అందరూ చూస్తుండగా రాంజీ సహా మరో వెయ్యిమందిని ఉరి తీశారు. తమ ప్రాణాలను దేశ స్వేచ్ఛ కోసం త్యాగం చేశారు.

తెలంగాణ, మహారాష్ట్ర సరిహద్దుల్లో..


నిర్మల్, సిర్పూర్, భైంసా, రాజురా, కాగజ్‌నగర్‌లో రజాకార్ల క్యాంపులు ఏర్పాటయ్యా యి. నాటి భైంసా, ముథోల్ మహారాష్ట్రలోని నాందేడ్ జిల్లాలో ఉండేవి.

- 1948 జూన్‌లో చంద్రాపూర్‌లో 50మంది రజాకార్లు సిరంబా సరిహద్దు నగరా గ్రామంపై దాడికి యత్నించి విఫలమయ్యారు.
- 1948 జూలైలో 300మంది రజాకార్లు అర్లీ గ్రామంపై దోచుకునేందుకు రాగా, గ్రామ రక్షక దళం,నిజాం పోలీసులు, రజాకార్ల మధ్య పోరాటం జరిగింది. నలుగురు రజకార్లు, ఒక గ్రామస్తుడు మరణించారు.
- 1948 జూలై 20న బీరారు సరిహద్దు రాజగాంలో యూనియన్ సైన్యంతోపాటు దళాలు ఐదిసెలు పోరాటం జరిగాయి.


నాటికి నేటికి ఎంతో మార్పు

1872లో సిర్పూర్, తాండూరు ఉప జిల్లా(సబ్ డిస్ట్రిక్ట్)లో ఎదులాబాద్, రాజురా, సిర్పూర్ తాలూకాలుగా ఉండేవి. 1905లో ఆదిలాబాద్ జిల్లా కేంద్రంగా మారింది. 1925గెజిట్ ప్రకారం ఆసిఫాబాద్ పట్టణంగానే కార్యకలాపాలు సాగాయి. ఆసిఫాబాద్‌ను జనగామగా పిలిచేవారు. ఆదిలాబాద్, ఆసిఫాబాద్, చెన్నూరు, ఎల్గపహాడ్ పైగా జాగీర్(ఖానాపూర్), సిర్పూర్, రాజురా(మహారాష్ట్ర), ఉట్నూర్ డివిజన్లుగా కొనసాగాయి. మొత్తం 7394చ.కి.మీ. విస్తరించి ఉండేది. నిజాం సంస్థానం విలీనం తర్వాత మరాఠీ ప్రాంతాలు మహారాష్ట్రలో కలపగా, ప్రస్తుత ఉమ్మడి జిల్లా నాలుగు జిల్లాలుగా కొనసాగుతోంది.

ఉద్యమ శిఖరం 'కొండా'



కొండా లక్ష్మణ్ బాపూజీ(ఫైల్)



రాంజీగోండు (ఫైల్)

ఆసిఫాబాద్: తెలంగాణ తొలి, మలి తరం ఉద్యమాల్లో ఆచార్య కొండా లక్ష్మణ్ బాపూజీ కీలక పాత్ర పోషించారు. హైదరాబాద్ సంస్థానం, ప్రస్తుత మహారాష్ట్రలోని రాజూరాకు చెందిన కొండా లక్ష్మణ్ పౌర విమోచనోద్యమంలో 1938లో తొలిసారి అరెస్టయ్యారు. 1941- 42లో ఖద్దరు ఉద్యమం, క్విట్ ఇండియా ఉద్యమాల్లోనూ పాల్గొన్నారు. తెలంగాణ సాయుధ పోరులో భాగమయ్యారు. నిజాం నిరంకుశ పాలనకు వ్యతిరేకంగా అలుపెరుగని పోరాటం చేశారు. జిల్లా కేంద్రానికి చెందిన దండనాయకుల గోపాలకిషన్‌రావు, చీల శంకర్, చీల విఠల్, రాంసింగ్, ఖాండ్రే శంకర్, ఏకబిల్వం నాగేంద్రయ్య, ఏకబిల్వం రేవయ్య, బోనగిరి వెంకటేశం, చందారవార్ విఠల్, తాటిపెల్లి తిరుపతి, జగన్నాథ్ మహారాష్ట్రలోని చాందా నిర్వహించిన సాయుధ శిక్షణ శిబిరంలో ఏడాది పాటు శిక్షణ పొందారు. 1947లో కింగ్‌కోఠి నుంచి బయటకు వచ్చిన నిజాం నవాబుపై బాంబులు విసిరిన ఘటనలో బాపూజీ నిందితుడిగా ఉన్నారు. మహారాష్ట్రలోని చాందా మిలటరీ క్యాంపులో మిలటరీ పంజాబ్ రెజిమెంట్ లేజర్ పీస్ గుహన్ వీరికి శిక్షణ అందించారు. అక్కడ క్యాంపు ఇన్‌చార్జి గోపాల్ శాస్త్రి బేకర్, బల్లార్షా క్యాంపు ఇన్‌చార్జిగా కేవీ కేశవులు ఉన్నారు. కొండా లక్ష్మణ్ బాపూజీ ఈ రెండు క్యాంపులకు వ్యూహకర్తగా వ్యవహరించారు. ఉద్యమాల్లో పాల్గొన్న ఆయన 13సార్లు అరెస్టయ్యారు.

న్యూస్‌రీల్

టీపీసీసీ అధ్యక్షుడిని కలిసిన విఠల్‌రెడ్డి



మహేశ్ కుమార్‌గౌడ్‌తో మాజీ ఎమ్మెల్యే విఠల్‌రెడ్డి

భైంసాటౌన్: టీపీసీసీ చీఫ్‌గా బొమ్మ మహేశ్‌కుమార్ గౌడ్ బాధ్యతలు చేపట్టిన నేపథ్యంలో ముథోల్ మాజీ ఎమ్మెల్యే జి.విఠల్‌రెడ్డి ఆయనను మర్యాద పూర్వకంగా కలిశారు. సోమవారం హైదరాబాద్‌లోని గాంధీభవన్‌లో కలిసి శాలువాతో సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. పార్టీ కోసం విధేయుడిగా పనిచేసిన మహేశ్‌కుమార్ గౌడ్‌కు సీఎం రేవంత్‌రెడ్డి, పార్టీ అధిష్ఠానం సముచిత స్థానం ఇవ్వడంపై హర్షం వ్యక్తం చేశారు.

కలెక్టరేట్‌లో నేడు ప్రజాపాలన దినోత్సవం

నిర్మల్: రాష్ట్ర ప్రభుత్వం సెప్టెంబర్ 17ను తెలంగాణ ప్రజాపాలన దినోత్సవం అధికారికంగా నిర్వహించాలని ఆదేశించడంతో ఈ మేరకు జిల్లాలో ఏర్పాట్లు చేశారు. స్థానిక సమీకృత కలెక్టర్ కార్యాలయంలో మంగళవారం ఉదయం 10 గంటలకు ఈ వేడుకను నిర్వహించనున్నట్లు కలెక్టర్ అభిలాష అభినవ్ పేర్కొన్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా తెలంగాణ ఫైనాన్స్ కమిషన్ చైర్మన్ సిరిసిల్ల రాజయ్య హాజరు కానున్నారు.

నేడే వినాయక నిమజ్జనం

- గణనాథునికి వీడ్కోలు పలకనున్న నిర్మల్ వాసులు
- జిల్లా కేంద్రంలో ఏర్పాట్లు చేసిన ఉత్సవ సమితి
- పోలీసుల భారీ బందోబస్తు



వినాయక సాగర్ వద్ద ఏర్పాటు చేసిన క్రేన్

నిర్మల్‌టౌన్: 'ఏకదంతాయ.. వక్రతుండాయ.. గౌరీ తనయ ధీమహి' అంటూ.. పది రోజులపాటు పూజలు అందుకున్న గణనాథుని వీడ్కోలుకు సమయం ఆసన్నమైంది. జిల్లా కేంద్రంలో కొలువు దీరిన గణపయ్యలు మంగళవారం గంగమ్మ ఒడికి చేరేందుకు సిద్ధమయ్యారు. ఉత్తర తెలంగాణలోనే నిర్మల్ గణేశ్ నిమజ్జనోత్సవం ప్రత్యేకంగా నిలుస్తుంది. ఇక్కడ ప్రతీ వార్డు గణపతులకు నంబర్లు ఉంటాయి. 1 నుంచి 50 వరకు నంబర్ గణపతులు ఉన్నాయి. కేటాయించిన నంబర్ల వారీగా శోభాయాత్రలో పాల్గొంటాయి.

శోభాయాత్ర ఇలా..

మొదట బుధవార్‌పేట్‌లోని ఒకటో నంబర్ గణపతి వద్ద ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్‌రెడ్డి, అధికారులు ప్రత్యేక పూజలు చేసి శోభాయాత్ర ప్రారంభిస్తారు. అక్కడి నుండి వరుసగా మిగతా గణపతులు పాత బస్టాండ్, వివేక్‌చౌక్, జయశంకర్ చౌరస్తా, నాగేశ్వర్ వాడ, ధ్యాగావాడ, పెద్ద మార్కెట్, దేవరకోట, వన్ టౌన్ పోలీస్ స్టేషన్, సోమవార్‌పేట్, గాంధీ చౌక్, నాయుడువాడ, బెస్తవార్ పేట్ మీదుగా వినాయక సాగర్ వరకు శోభాయాత్ర కొనసాగుతుంది.

వినాయక సాగర్ వద్ద ఏర్పాట్లు

వినాయకుల నిమజ్జనం కోసం మున్సిపల్, పంచాయతీరాజ్, రెవెన్యూ, విద్యుత్, ఫైర్, పోలీస్ అధికారుల పర్యవేక్షణలో బంగల్‌పేట్‌లోని వినాయక సాగర్ (బంగల్ పేట్ చెరువు) వద్ద ఏర్పాట్లు పూర్తి చేశారు. ఈ చెరువుతో పాటు కంచేరోడి చెరువు, సిద్దాపూర్ వాగు వద్ద కూడా నిమజ్జన ఏర్పాట్లు చేశారు. వినాయక సాగర్ వద్ద క్రేన్ సిద్ధం చేశారు. మున్సిపాలిటీ ఆధ్వర్యంలో నాగేశ్వరవాడ, నిషాన్, గాంధీ చౌక్, నాయుడు వాడ, బంగల్ పేట్ ఏరియాలో జనరేటర్లు, 500 వరకు అదనంగా వీధి దీపాలు ఏర్పాటు చేశారు. చెరువు వద్ద 12 మంది గజ ఈతగాళ్లను అందుబాటులో ఉంచారు.

అధిక సౌండ్ వచ్చే డీజేలు నిషేధం

అధిక సౌండ్ వచ్చే డీజేలు, పక్క రాష్ట్రం నుంచి తెచ్చిన తెచ్చే డీజేలు పెడితే సీజ్ చేయనున్నారు. బాణసంచా కాల్చడం, లేజర్ లైట్స్, డీజే వాహనం పైన పేపర్ ముక్కలు విసిరే మోటార్ పెట్టవద్దని మండపాల నిర్వాహకులకు సూచించారు. రెండు సౌండ్ బాక్సులకు మాత్రమే పర్మిషన్ ఇచ్చారు. నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు తీసుకుంటామని పోలీసులు హెచ్చరించారు.

శోభాయాత్రలో అన్నప్రసాదం..

జిల్లా కేంద్రంలో వినాయక నిమజ్జనోత్సవ శోభాయాత్ర దాదాపు 20 గంటలపాటు పురవీధుల గుండా కొనసాగుతుంది. ఈనేపథ్యంలో నిమజ్జనోత్సవంలో పాల్గొనే వారితో పాటు 24గంటల పాటు రోడ్లపైనే విధులు నిర్వర్తించే పోలీసులు, ఇతర అధికారులు, సిబ్బందికి అన్నప్రసాదం, టిఫిన్లను అందించేందుకు నిర్మల్ మాజీ మున్సిపల్ చైర్మన్ అప్పాల గణేశ్‌చక్రవర్తి అన్ని ఏర్పాట్లు చేయించారు. స్థానిక రూరల్ పోలీసుస్టేషన్, ద్యాగవాడ చౌరస్తా, గాంధీచౌక్‌లలో మూడుచోట్ల మంగళవారం రాత్రి 8నుంచి బుధవారం ఉదయం 8వరకు దాదాపు 20వేల మందికి అల్పాహారం, తాగునీరు అందించనున్నారు. వినాయక నిమజ్జనం చేసే బంగల్‌చెరువు(వినాయకసాగర్) వద్ద బుధవారం ఉదయం 9గంటల నుంచి దాదాపు పదివేల మందికి అన్నప్రసాదాన్ని అందించేలా ఏర్పాట్లు చేశారు.

పోలీసుల భారీ భద్రత..

గతంలో జరిగిన ఘటనల నేపథ్యంలో నిమజ్జోత్సవానికి పోలీస్ శాఖ భారీ బందోబస్తు ఏర్పాటు చేసింది. ఎస్పీ జానకీ షర్మిల పర్యవేక్షణలో 9 సెక్టార్లలో 400 మంది ట్రెయినీ పోలీసులు, 300 మంది జిల్లా పోలీసులు, ఇద్దరు అడిషనల్ ఎస్పీలు, ఐదుగురు డీఎస్పీలు, 30 మంది సీఐలు, 40 మంది ఎస్సైలు బందోబస్తులో పాల్గొంటారు. నిమజ్జనం రూట్ లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేశారు. ఇవి పూర్తిగా పోలీస్ కమాండ్ కంట్రోల్ రూమ్‌కు అనుసంధానం చేయబడి ఉంటాయి. 24 గంటలు సిబ్బంది పర్యవేక్షణలో ఉంటాయి. ఎక్కడైనా చిన్న అలజడి ఏర్పడినా తక్షణమే స్పందించే విధంగా పోలీసు అధికారులు ఏర్పాట్లు చేశారు.

శాంతియుతంగా జరుపుకోవాలి

గణేశ్ నిమజ్జనం శాంతియుతంగా జరిపేందుకు పోలీసులకు సహకరించాలి. అసత్య ప్రచారాలు, పుకార్లు నమ్మవద్దు. అనుమానిత వ్యక్తులు కనిపిస్తే పోలీసులకు సమాచారం ఇవ్వాలి. ప్రజలకు ఏ అవసరమొచ్చినా సేవలు చేసేందుకు జిల్లా పోలీసులు సిద్ధంగా ఉన్నారు.

– జానకీ షర్మిల, ఎస్పీ

శభాష్.. మేడమ్..!

- భైంసాలో ప్రశాంతంగా నిమజ్జనం
- తనదైన శైలిలో ఎస్పీ బందోబస్తు నిర్వహణ



పంజేశ్‌చౌక్‌లో సూచనలు చేస్తున్న ఎస్పీ

భైంసాటౌన్: భైంసా పట్టణంలో వినాయక నవరాత్రోత్సవాలు, నిమజ్జన శోభాయాత్రపై రాష్ట్ర వ్యాప్త ఆసక్తి ఉంటుంది. గతంలో నెలకొన్న ఘటనల నేపథ్యంలో పట్టణంపై సున్నితప్రాంతంగా ముద్ర పడింది. దీంతో ఏటా వినాయక, దుర్గా నవరాత్రోత్సవాల సందర్భంగా ప్రశాంత వాతావరణంలో ఉత్సవాల నిర్వహణకు పోలీసు యంత్రాంగం తీవ్రంగా శ్రమించేది. ఉత్సవాలకు ముందు భారీగా పోలీసు బలగాలను మోహరించడం, సమస్యాత్మక ప్రాంతాల్లో కవాతు నిర్వహించడం చేసేవారు. కొన్నేళ్లుగా ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరుగకున్నా.. చెదురుమదురు ఘటనలతో కేసులు నమోదయ్యేవి. దీంతో ప్రశాంత ఉత్సవాల నిర్వహణ పోలీసులకు సవాల్‌గా మారేది.

ఎస్పీ తనదైన ముద్ర...

ఈసారి ఎస్పీ జానకీ షర్మిల, భైంసా ఏఎస్పీ అవినాష్ కుమార్ నేతృత్వంలో ఉత్సవాలకు వినూత్న రీతిలో బందోబస్తు ఏర్పాటు చేశారు. స్థానిక పోలీసు అధికారులతోపాటు ట్రెయినీ ఎస్సైలు, కానిస్టేబుళ్లకు బాధ్యతలు అప్పగించారు. ఉత్సవాల ప్రారంభం నుంచే ఇరువర్గాల మతపెద్దలతో శాంతికమిటీ సమావేశం ఏర్పాటు చేసి, ప్రశాంత ఉత్సవాల నిర్వహణకు సహకరించాలని సూచించారు. ఓవైపు భారీ బందోబస్తు ఏర్పాటు చేస్తూనే, మరోవైపు 'ప్యార్ ఔర్ మొహబ్బత్'తో ఉత్సవాలు జరుపుకోవాలని పదే పదే సూచిస్తూ ప్రతి ఒక్కరిని మెప్పించారన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది. శోభాయాత్ర సందర్భంగా యువకులను నృత్యం చేయకుండా అడ్డుకోవద్దని పోలీసులకు ముందుగానే సూచించారు. ఏదైనా సమస్య తలెత్తితే స్వయంగా తానే పరిష్కరిస్తానని సూచించడం, అవాంఛనీయ ఘటనలు జరుగకుండా బందోబస్తులో ఎస్పీ తనదైన ముద్రతో వ్యవహరించిన తీరుపై పలువురు ప్రశంసిస్తున్నారు.

'317 జీవో బాధితులకు న్యాయం చేయాలి'

నిర్మల్‌రూరల్: 317 జీవో బాధిత ఉపాధ్యాయులకు న్యాయం చేయాలని ఎస్సీ, ఎస్టీ ఉపాధ్యాయ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు ధర్మాజీ చందనే డిమాండ్ చేశారు. సోమవారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం కమిటీ వేసి నివేదిక తీసుకున్న తర్వాత కూడా ఆలస్యం చేయడం తగదన్నారు. వెంటనే వచ్చిన అప్పీళ్లు పరిష్కరించి బాధితులకు న్యాయం చేయాలని కోరారు. సమావేశంలో సంఘం జిల్లా అధ్యక్షుడు రాజేశ్ నాయక్, ప్రధాన కార్యదర్శి క్రాంతి కుమార్, కార్యవర్గ సభ్యులు రవీందర్, అడేళ్ల, తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

నిమజ్జనంలో కత్తి కలకలం

చెన్నూర్: చెన్నూర్‌లో ఆదివారం జరిగిన గణేశ్ నిమజ్జన శోభాయాత్రలో కత్తితో దాడి కలకలం సృష్టించింది. సీఐ రవీందర్ తెలిపిన వివరాలిలా ఉన్నాయి. పట్టణంలోని కొత్తగూడెం కాలనీలో గణేశ్ శోభాయాత్రలో ఇరువర్గాలు ఎదురెదురుగా రాగా ఘర్షణ పడ్డారు. తగరం ప్రణయ్, ఎల్ల బోయిన శివ నృత్యం చేస్తుండగా తుమ్మ శ్యామ్, రమేశ్ ఘర్షణకు దిగారు. తోపులాట జరగడంతో శ్యామ్, రమేశ్ కత్తితో ప్రణయ్, శివపై దాడి చేస్తుండగా అడ్డుగా వెళ్లిన కానిస్టేబుల్ కుడి చేతి వేలుకు గాయమైంది. కానిస్టేబుల్ ఫిర్యాదు మేరకు హత్యాయత్నం, విధులకు ఆటంకం కల్గించడంపై శ్యామ్, రమేశ్‌లపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ రవీందర్ తెలిపారు.

ఇద్దరు యువకులపై కేసు

బెల్లంపల్లి: బెల్లంపల్లిలో బాలికతో అసభ్యకరంగా ప్రవర్తించిన ఇద్దరు యువకులపై పోలీసులు సోమవారం కేసు నమోదు చేశారు. టూటౌన్ ఎస్సై మహేందర్ తెలిపిన వివరాల ప్రకారం.. బెల్లంపల్లి పట్టణంలోని గాంధీనగర్ బస్తీకి చెందిన బాలిక బస్తీలో ఆదివారం రాత్రి వినాయకుడి మండపం వద్ద అన్నదానం కార్యక్రమానికి వెళ్లింది. అదే బస్తీకి చెందిన ఎల్పుల నవీన్, చిప్ప హరీష్ బాలికతో అసభ్యకరంగా ప్రవర్తించారు. అక్కడే ఉన్న బాలిక సోదరుడు ఆమెను ఇంటికి తీసుకెళ్లాడు. బాలిక తల్లి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి ఇద్దరు యువకులను అరెస్టు చేసినట్లు ఎస్సై తెలిపారు.

ఆర్టీసీ బస్సులో చోరీ

ముథోల్: బాసర నుండి భైంసా వెళ్తున్న ఆర్టీసీ బస్సులో సోమవారం చోరీ జరిగింది. బస్సులో ప్రయాణిస్తున్న ముగ్గురు ప్రయాణికుల సెల్‌ఫోన్‌లు చోరీకి గురికావడంతో డ్రైవర్‌కు సమాచారం అందించారు. దీంతో డ్రైవర్ బస్సును ముథోల్ పోలీస్ స్టేషన్‌కు తీసుకెళ్లాడు. పోలీసులు బస్సులోని ప్రయాణికులను తనిఖీ చేయగా ఫోన్‌లు దొరకలేదు. దొంగతనానికి పాల్పడిన వారు మధ్యలో బస్సు దిగి ఉండవచ్చని పోలీసులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు.

చెరువులో పడి యువకుడు మృతి

చింతలమానెపల్లి(సిర్పూర్): చింతలమానెపల్లి మండల కేంద్రానికి చెందిన కొంపరి కిరణ్(28) చెరువులో పడి మృతి చెందాడు. ఎస్సై ఇస్లావత్ రమేశ్ తెలిపిన వివరాల ప్రకారం.. కొన్నేళ్లుగా కిరణ్‌కు మతిస్థిమితం లేదు. ఈ నెల 14న ఇంటి నుంచి బయటికి వెళ్లాడు. మండల కేంద్రానికి సమీపంలోని చెరువులో కిరణ్ మృతదేహాన్ని గుర్తించిన స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. మృతుడి తండ్రి సదయ్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని ఎస్సై తెలిపారు.

నలుగురు యువకులపై కేసు

చెన్నూర్: చెన్నూర్ పట్టణంలో ఆదివారం నిర్వహించిన గణేశ్ నిమజ్జన శోభాయాత్రలో నలుగురు యువకులపై కేసు నమోదు చేసినట్లు సీఐ రవీందర్ తెలిపారు. జెండావాడ గణేశ్ మండలికి చెందిన సుంకరి శ్రావణ్, మానెశెట్టి మహేశ్, చెన్న శ్రీకాంత్, కొండు సాయి, మరికొందరు యువకులు నృత్యం, నినాదాలు చేస్తూ ఇతర మతాలకు ఇబ్బందులు కలిగే విధంగా వ్యవహరించారని తెలిపారు. కానిస్టేబుల్ ఇరుగురాల శంకర్ వారించే ప్రయత్నం చేయగా దురుసుగా ప్రవర్తించారని పేర్కొన్నారు. కానిస్టేబుల్ ఫిర్యాదు మేరకు శ్రావణ్, మహేశ్, శ్రీకాంత్, సాయిలతోపాటు మరికొందరిపై కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు.

ఆసిఫాబాద్‌లో ఆనాటి గుర్తులు



ఆసిఫాబాద్ ఆర్టీసీ డిపో

ఆసిఫాబాద్: నిజాం కాలానికి ముందు ఆసిఫాబాద్ ప్రాంతాన్ని జనగామగా పిలిచేవారు. హైదరాబాద్ సంస్థానాధీశుడు 1907లో ఈ ప్రాంతానికి ఆసిఫాబాద్‌గా నామకరణం చేశారు. జన్కాపూర్‌లో ఐదెకరాల్లో సుమారు 200 మంది ఖైదీలు ఉండే విధంగా జిల్లా జైలు నిర్మించారు. ఇందులో మహిళలకు ప్రత్యేక బ్యారక్ ఉంది. కొద్దికాలం జైలు నిర్వహణ నిలిచిపోయింది. మరమ్మతుల అనంతరం 1991 మార్చి 15న అప్పటి ఉమ్మడి జిల్లా కలెక్టర్ ఎంజీ గోపాల్ తిరిగి పునరుద్ధరించారు. 17 ఏళ్లపాటు జిల్లా జైలుగా కొనసాగగా.. 2008లో ఆదిలాబాద్‌కు తరలించి, ఇక్కడి జైలును స్పెషల్ సబ్ జైలుగా మార్చారు.

మొదటి ఆర్టీసీ డిపో ఇక్కడే..

నిజాం పాలనలో రాష్ట్రంలోనే మొదటి ఆర్టీసీ డిపోను ఆసిఫాబాద్‌లో ఏర్పాటు చేశారు. ఆసఫ్ జాహి వంశం పేరుతో ఏర్పాటైన ఆసిఫాబాద్‌కు అప్పటి సర్కార్ అధిక ప్రాధాన్యతనిచ్చింది. బ్రిటిష్ పాలకుల సహకారంలో వాహనాలు కొనుగోలు చేసి 1932 జూన్ 15న రోడ్డు, రైల్వే ట్రాన్స్‌పోర్టు డిపార్ట్‌మెంట్ ఏర్పాటు చేశారు. ఉస్మాన్ అలీ ఖాన్ నల్గొండ జిల్లాలోని నార్కట్‌పల్లి, వరంగల్ జిల్లాలోని కాజీపేట, ఆసిఫాబాద్‌లో బస్సు డిపోలు నెలకొల్పారు. ఇంగ్లాండ్ నుంచి 27 అల్బీసీయస్ బస్సులు తెప్పించగా నార్కట్‌పల్లికి 10, కాజీపేట్‌కు 10, ఆసిఫాబాద్‌కు ఏడు కేటాయించారు. రహదారులు, వంతెనలు సక్రమంగా లేకపోయినా ఆసిఫాబాద్ నుంచి రెబ్బెన, మంచిర్యాల, మహారాష్ట్రలోని రాజురాకు బస్సులు నడిపించారు. అనంతరం రైల్వే డిపార్ట్‌మెంట్ 1951లో ఇండియన్ యూనియన్‌తో విలీనం కావడంతో రోడ్డు ట్రాన్స్‌పోర్టు డిపార్ట్‌మెంట్ మాత్రమే మిగిలింది. 1958 మే 11న ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థగా దీన్ని మార్చారు. ఆసిఫాబాద్ డిపోను 1979లో పట్టణంలోని రాష్ట్రీయ రహదారి పక్కన నిర్మించిన కొత్త స్థలంలోకి మార్చారు. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా నుంచి మొదటిసారి హైదరాబాద్‌కు బస్సు నడిపిన చరిత్ర ఆసిఫాబాద్ డిపోదే. అలాగే జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల చాలాకాలం పాటు నిజాం కాలంనాటి భవనంలోనే కొనసాగింది. రెబ్బెన మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన రైల్వేస్టేషన్‌కు ఆసిఫాబాద్ రోడ్ అని పేరు పెట్టారు.

నాటి పోరాటానికి అడ్డా.. అద్దాల మేడ

- బసచేసిన అప్పటి గవర్నర్
- సర్దార్ వల్లభాయి పటేల్ సందర్శించినట్లు ప్రచారం


మహారాష్ట్రలోని సిరొంచాలో అద్దాల మేడ

చెన్నూర్: నాడు నిజాం సర్కారు గుండెల్లో ఫిరంగులు మోగించేందుకు అద్దాల మేడ కేంద్ర బిందువైంది. నియంతృత్వ పాలన అంతానికి మిలటరీ దళాలు మహారాష్ట్రలోని సిరొంచలో ఉన్న అద్దాల మేడను స్థావరంగా చేసుకున్నాయి. 1901 బ్రిటిష్ కాలంలో అప్పటి కలెక్టర్ గ్లాస్ ఫోర్డ్ తెలంగాణ, మహారాష్ట్ర సరిహద్దులోని సిరొంచ ప్రాణహిత నది ఒడ్డున అద్దాల మేడ నిర్మించారు. ఈ మేడను ఇండియన్ మిలటరీ సైనికులు స్థావరంగా ఏర్పరుచుకున్నారు. ఇక్కడి నుంచే నిజాం సర్కార్‌పై పోరాటం సాగించారు. నేటికీ అద్దాల మేడ చెక్కు చెదరలేదు. మంచిర్యాల జిల్లా కోటపల్లి మండలం రాపన్‌పల్లికి మూడు కిలోమీటర్ల దూరంలోని ప్రాణహితనది అవతలి ఒడ్డున ఉన్న సిరోంచలో అద్దాల మేడ ఉంది. ఇక్కడి నుంచే హైదారాబాద్‌లోని నిజాం సర్కార్‌పై పోరాటానికి వ్యూహరచన చేసి నిజాంతో ఇండియన్‌మిలిటరీ సైనికులు వీరోచిత పోరాటాలు చేశారని అప్పటి స్వాతంత్ర్య సమరయోధులు చెప్తుంటారు. ఆనాడు కలెక్టర్, గవర్నర్ బంగ్లాగా అద్దాలమేడను వినియోగించారు. 1947లో మద్రాసు గవర్నర్ పట్టాభి సీతారామయ్య ఈ భవనంలో బస చేశారు. రజాకార్ల ఉద్యమం అనంతరం హైదరాబాద్ నిజాం సర్కార్‌తో చర్చలకు అప్పటి హోంశాఖ మంత్రి వల్లభాయ్ పటేల్ అద్దాల మేడకు వచ్చినట్లు సమాచారం. సైనికులు వాడిన ఫిరంగులు కాలగర్భంలో కలిసిన ఆనవాళ్లు నేటికీ ఇక్కడ కన్పించడం విశేషం.

సమరయోధులకు గుర్తింపేది..!?


సమరయోధుల శిలాఫలకం


తెలంగాణ విముక్తి కోసం పోరాడిన సమరయోధులు(ఫైల్)

- పోరుగడ్డపై వీరులకు అన్యాయం
- వాళ్ల త్యాగాలకూ అవమానమే..
- తాగుబోతుల అడ్డాగా 'స్మారకం'
- పక్కన పడేసిన 'శిలాఫలకం'
- చరిత్రకు ఇంకెప్పుడు గుర్తింపు..!?

నిర్మల్: విమోచనమా.. విలీనమా.. ప్రజాపాలనా..! పేరు ఏదైనా ఈ రోజు కోసం ప్రాణాలను సైతం పణంగా పెట్టినవారి పేర్లు మాత్రం చరిత్రకెక్కడం లేదు. నిన్న మొన్న కాదు.. 1857నుంచే స్వాతంత్ర్య పోరులో నిర్మల్ భాగమైంది. కానీ ఇక్కడి వీరులకు, నాటి పోరుకు చరిత్రలో మాత్రం గుర్తింపు దక్కడం లేదు. కనీసం వారి ఆనవాళ్లకూ సరైన గౌరవమూ ఇవ్వకపోవడం శోచనీయం.

గుర్తింపు ఇంతేనా..!?

1857–58లోనే ప్రథమ భారత సంగ్రామానికి కొనసాగింపుగా నిర్మల్‌గడ్డపై పోరాడి ప్రాణాలర్పించిన యోధుడు రాంజీ. ఆ వీరుడి స్ఫూర్తితోనే నైజాం నిరంకుశత్వంపై ఎలుగెత్తి, జల్ జంగల్ జమీన్ తమవేనంటూ పోరాడిన యోధుడు కొమురం భీమ్. ఇలాంటి వీరులకూ జిల్లాలో సరైన గుర్తింపు దక్కడం లేదు. జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేసిన విగ్రహాలే వారికి ఎంత గుర్తింపునిస్తున్నారో ప్రత్యక్షంగా చెబుతాయి. కనీసం ఆరు అడుగులు ఉండాల్సిన విగ్రహాలను చిన్నగా పెట్టేశారు. ఊరిబయట ఎల్లపల్లి దారిలో ఉన్న రాంజీ సహా వెయ్యిమంది వీరులను ఉరితీసిన వెయ్యిఉరుల మర్రి స్మారకస్థూపం వద్ద పరిస్థితి మరీ దారుణం.. ఎలాంటి ఫెన్సింగ్ లేకపోవడంతో ఆ ప్రాంతం తాగుబోతులకు అడ్డాగా మారింది. ఎన్నిసార్లు అక్కడ మర్రిమొక్కలను నాటినా.. కనీసం కాపాడేవాళ్లు లేరు.


శిలాఫలకాన్నీ గౌరవించరా..!?

జిల్లాకు చెందిన ప్రముఖ స్వాతంత్ర్య సమరయోధులకు సంబంధించి ఉన్న ఆధారమంటే.. వారి పేర్లతో ఉన్న ఒకే ఒక స్మారక శిలాఫలకం. అదికూడా రెండేళ్లుగా ఎవరికీ పట్టని అనాథలా ఓ మూలన పడేసి ఉంది. రెండేళ్ల క్రితం వరకు నిర్మల్ అర్బన్ కార్యాలయం ఎంట్రన్స్‌లోనే ఉండేది. ఆ కార్యాలయం కూల్చిన తర్వాత ఆర్డీవో కార్యాలయ ఆవరణలో పడేశారు. పాలకులు, అధికారులు ప్రతీ ఏడాది విమోచన/విలీన/ప్రజాపాలన అంటూ పేర్లు మారుస్తూ దినోత్సవాలు జరుపుతున్నా కనీసం నాటి అమరవీరులు, సమరయోధులకు కనీసం గుర్తింపునివ్వడం లేదని జిల్లావాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

సమర యోధులు గుర్తున్నరా..!?

రాంజీ సహా వెయ్యిమంది అమరవీరులనే మర్చిపోయిన వారికి ఇక ఆ తర్వాత మలిదశ సమరయోధులు గుర్తుంటారా.. అన్న ప్రశ్న రావడం సహజం. తెలంగాణ విముక్తి కోసం జిల్లాకు చెందిన ఎంతోమంది సమరయోధులు కదంతొక్కారు. నిర్మల్ పంచాయతీ సమితి పరిధిలో గోపిడి గంగారెడ్డి, గణపతి, బాపూరావు, బోరేగాం గజన్న, లాలు పటేల్, ఏ.రా జన్న, పోశెట్టి, గంగాధర్, శివన్న, గంగారామ్, విఠల్‌రావు, జమునాలాల్, వెంకోబరావు, గాంధారి చిన్న నర్సింహులు, లింగారెడ్డి, సుందర్‌రాజ్, ముడుసు ఎల్లయ్య, అర్గుల గంగాధర్‌గుప్తా, హన్మంత్‌రావు ఠాకూర్.. ఇలా ఎంతోమంది నైజాం, ఆంగ్లేయులతో పోరాడారు. నెలల తరబడి ఎక్కడో ఔరంగాబాద్ వంటి దూరంగా ఉన్న జైళ్లలో మగ్గారు.

భీం వీరోచిత పోరాటం


కుమురంభీం

ఆసిఫాబాద్: గోండు బెబ్బులి కుమురం భీం నిజాంతో వీరోచిత పోరాటం సాగించారు. ఆసిఫాబాద్ మండలం రౌటసంకెపల్లి గ్రామంలో కుమురం చిన్ను, సోంబాయి దంపతులకు 1901లో భీం జన్మించారు. అప్పటి పెత్తందార్లు, అటవీశాఖ అధికారుల అకృత్యాలను కళ్లారా చూసి చలించిపోయారు. జల్, జంగల్, జమీన్ నినాదంతో నిజాం ప్రభుత్వంపై పోరు సాగించారు. ప్రకృతితో సహజీవనం చేసే ఆదివాసీలకు అడవిపై హక్కు ఉండాలని కెరమెరి మండలం జోడేఘాట్ కేంద్రంగా గెరిల్లా పోరాటం చేశారు. బాబేఝరి కేంద్రంగా గిరిజనులతో కలిసి అడవి నరికి 12 గ్రామాలను ఏర్పాటు చేశారు. ఈ క్రమంలోనే నిజాం సర్కారు కేసులు పెట్టింది. కేసుల నుంచి విముక్తి కోసం నిజాం నవాబును కలిసేందుకు హైదరాబాద్ వెళ్లిన భీంకు నిరాశే ఎదురైంది. హైదరాబాద్ నుంచి ఆయన తిరిగి వచ్చేసరికి జంగ్లాత్ సేరేదార్ 12 గ్రామాలపై విరుచుకుపడి తగులబెట్టాడు. ఆగ్రహానికి గురైన భీం అటవీశాఖ అధికారులపై తిరగబడ్డారు. 'జల్, జంగల్, జమీన్' కోసం ఇంటికో యోధుడు కావాలని పిలుపునిచ్చి గిరిజన యువకులతో సాయుధ దళం ఏర్పాటు చేశాడు. 1940లో దాదాపు ఏడు నెలల పాటు భీం అనుచరులు, నిజాం సేన మధ్య పోరు కొనసాగింది. మడావి కొద్దు అనే నమ్మక ద్రోహి ఇచ్చిన సమాచారంతో అక్టోబర్ 10న ఆశ్వయుజ పౌర్ణమి రోజు ఐదు గంటల పాటు సాగిన భీకర పోరులో కుమురం భీం నేలకొరిగారు.

షెల్టర్ జోన్.. లంబాడితండా


ఆశ్రయం పొందిన ఇల్లు


బాశెట్టి గంగారాం


కుమారస్వామి

బెల్లంపల్లి: బొగ్గు తవ్వకాలతో ఏర్పడిన కార్మిక క్షేత్రం బెల్లంపల్లికి అత్యంత చేరువలో ఉన్న లంబాడితండా గ్రామాన్ని షెల్టర్‌జోన్‌గా మల్చుకుని తెలంగాణ సాయుధ పోరాట యోధులు కార్యకలాపాలు నిర్వహించారు. దొరలు, భూస్వాముల ఇళ్లపై కరువు దాడులు, భౌతిక దాడులకు పాల్పడిన పోలీసు(శత్రువు) నిర్బంధం పెరిగిన ప్రతీసారి గెరిల్లా పోరాట యోధులు అటవీ ప్రాంతం నుంచి లంబాడితండా షెల్టర్ జోన్‌కు వచ్చి కొద్ది రోజుల పాటు ఆశ్రయం పొందేవారు. ఈ గ్రామానికి తరచూ పోలీసు బలగాలు వచ్చి వెళ్లినా దళ నాయకుల ఆచూకీ ఏమాత్రం తెలవకుండా కడుపులో దాచుకుని కంటికి రెప్పలా కాపాడుకున్నారు తండావాసులు. సల్లం పోశం, సుకాసి పోశం, సుకాసి బాలయ్య ప్రధాన నమ్మిన బంట్లుగా వ్యవహరించారు. దున్నేవాడికే భూమి కావాలని, నిజాం నిరంకుశ ప్రభుత్వానికి వ్యతిరేకంగా సాయుధ గెరిల్లా పోరాటం జిల్లాలో వీరోచితంగా సాగింది. జిల్లాకు చెందిన కమ్యూనిస్టు నాయకులు బాశెట్టి గంగారం, పోతుగంటి పోశెట్టి, జె.కుమారస్వామి బంధూకులు చేత బట్టారు. సర్వ దేవభట్ల రామనాథం, దేవూరి శేషగిరిరావు, పర్సా సత్యనారాయణ తదితర అగ్ర నాయకుల కనుసన్నల్లో కార్మిక, ప్రజా సమస్యలపై పోరు సల్పారు.


పోతుగంటి పోశెట్టి

పోలీసులు చుట్టుముట్టడంతో..

లంబాడితండా గ్రామాన్ని ఓసారి పోలీసులు చుట్టుముట్టారు. ఆ సమయంలో దళ నాయకుడు కుమారస్వామి షెల్టర్ ఇంట్లో తలదాచుకున్నాడు. గ్రామ కొరియర్లు కుమారస్వామికి సమాచారం అందించారు. కానీ అప్పటికే ఇంటి వరకు పోలీసులు వచ్చారు. కుమారస్వామి మహిళ వేషం వేసి పోలీసుల నుంచి తప్పించుకున్నాడు.

భూస్వామిగా భ్రమపడి

ఆసిఫాబాద్‌కు చెందిన భూస్వామి పైకాజీని అంతమొందించాలని సాయుధ పోరాట దళం నిర్ణయించింది. తాండూర్ మండలం రాంపూర్ గ్రామంలో ఓ ఇంటికి ఓ రోజు రాత్రి భూస్వామి పైకాజీ వస్తున్నట్లు దళానికి సమాచారం అందింది. ఆ ఇంటికి వచ్చిన వ్యక్తిని పైకాజీగా భ్రమపడి సాయుధ దళం దాడి చేసి భూస్వామి గుమాస్తాను చంపేసింది. పైకాజీ ఆ రోజు రాకపోవడంతో ప్రాణాలు కాపాడుకున్నాడు.

రజాకార్లను ఎదిరించిన బోథ్ బిడ్డలు


బోథ్‌లో నిజాంకు వ్యతిరేకంగా పోరాడిన ఉద్యమకారులు (ఫైల్)


తక్కల చరణ్‌దాస్‌రెడ్డి (ఫైల్)


పూండ్రు రాజిరెడ్డి (ఫైల్)


బొందిడి వెంకట్రావ్ (ఫైల్)


చట్ల శంకర్రావ్(ఫైల్)

బోథ్: పిడికిలి బిగిసింది.. నరం నరం రగిలింది.. నిజాం వెన్నులో వణుకు పుట్టింది.. రజాకార్ల రాక్షసత్వానికి విసిగిన అట్టడుగు వర్గాల నుంచి పుట్టిన ఉద్యమమది.. భూస్వాముల దోపిడీ, అవమానాలు, వెట్టిచాకిరీకి వ్యతిరేకంగా కన్నెర్ర చేసిన కదనరంగమది. నిజాం నిరంకుశ పాలనకు వ్యతిరేకంగా రజాకార్ల దురాగతాలను అడ్డుకోవడానికి, భూమి కోసం, భక్తి కోసం, బానిస సంకెళ్ల విముక్తి కోసం జరిగిన పోరాటంలో ఎంతో మంది యోధులు అమరులయ్యారు. తుపాకీ తూటాలకు కొందరు బలైతే.. అజ్ఞాతంలో తిండి తిప్పలు లేక మరికొందరు ప్రాణాలు విడిచారు. ఇందులో బోథ్ వీరులెందరో ఉన్నారు.

బోథ్‌కు ఘన చరిత్ర..

తెలంగాణలో సాయుధ పోరాటంలో బోథ్ చరిత్ర ఎంతో ఘనమైనది. ఈ ప్రాంతానికి చెందిన ఏనుగు మల్లారెడ్డి, బి.వెంకట్‌రావ్, గుండేరావు, తక్కల చరణ్‌దాస్‌రెడ్డి, పూండ్ర రాజిరెడ్డి, ప్రభాకర్‌రావు, శంకర్ దేవిదాస్‌రావు, రాజేశ్వర్ రెడ్డి, సొనాలకు చెందిన లక్ష్మణ్‌రావు సూర్య, దొండబాయి, యార్లరెడ్డి దేవురావు, లింగారెడ్డి, బజార్‌హత్నూర్‌కు చెందిన లక్ష్మణ్‌సింగ్, శంకర్‌సింగ్, ఆనందబాయి, ధన్నూర్‌కు చెందిన డి.రాజన్న, నడిపెన్న, చట్ల నారాయణ, సింగం వీరన్న, గంగాధర్, తేజాపూర్‌కు చెందిన డి.చిన్నముత్యంతో పాటు మరికొందరు సాయుధ పోరాటంలో పాల్గొన్నారు. మహారాష్ట్రలోని కిన్వట్, చనాఖా, చంద్రాపూర్, సిర్వంచల్లో ఈ ప్రాంతానికి చెందిన 30 మంది పోరాట యోధులు రజాకార్లను ధీటుగా ఎదుర్కొనేందుకు ప్రత్యేక శిక్షణ పొందారు. ఈ క్రమంలో ఉమ్రి గ్రామంలో సుమారు రూ.20లక్షలు దోపిడీ చేసి పేదలకు పంచారు. విషయం తెలుసుకున్న రజాకార్లు ప్రత్యేక బలగాలతో వారిపై కాల్పులు జరిపారు. పట్టుబడిన కొంతమందిని 1947లో ఆసిఫాబాద్ జైలుకు తరలించారు. దాదాపు ఆరు నెలల పాటు వారంతా జైల్లోనే గడిపారు.

నిజాం నాటి తహసీల్ కార్యాలయం



బోథ్ తాలుకా ప్రాంతం నిజాం కాలంలో పాలన కేంద్రంగా ఉండేది. ఇక్కడి నుంచే దాదాపు 10 మండలాల పాలనను సాగించేవారు. 1932లో ఈ తహసీల్ కార్యాలయాన్ని నిజాం కట్టించాడు. ఈ నిర్మాణానికి 92 ఏళ్లు. ప్రస్తుతం ఈ భవనం చరిత్రకు సాక్ష్యంగా నిలుస్తోంది.

నిజాం ఏజెంట్‌ను తరిమిన గోట్కూరి గ్రామం

తాంసి: తెలంగాణ సాయుధ పోరాటంలో ఈ ప్రాంతవాసులు సైతం భాగస్వాములయ్యారు. రజాకార్లపై పోరాటానికి సాక్షిగా తాంసి మండలంలోని గోట్కూరి గ్రామం నిలుస్తోంది. గ్రామానికి చెందిన పలువురు ఇక్కడి నుంచే సాయుధ పోరాటంలో పాల్గొన్నారు. జైహింద్ అనే ఉద్యమంతో చిల్క దేవన్న, గాలిపెల్లి రాములు, గోపి ఎర్రన్న, బత్తుల చిన్నయ్య, అర్ధాంగి లింగన్న, కట్ట కిష్టయ్య తదితరులంతా కలిసి ఇక్కడ నిజాంకు ఏజెంట్‌గా వ్యవహరించిన వ్యక్తిని తరిమికొట్టారు. అతడిని నిపాని సమీపంలో పట్టుకొని బంధించగా.. గ్రామ సమీపంలోని బావిలో దూకి తప్పించుకున్నట్లు నాటి తరం వారు చెబుతుంటారు. ఇప్పటికీ ఆ బావి గ్రామంలో నాటి పోరాటానికి సజీవ సాక్షిగా నిలుస్తోంది.


ఏజెంట్ తప్పించుకున్న బావి ఇదే..

సాయుధ పోరాటంలో మా నాన్న..



మా నాన్న అర్ధాంగి లింగన్న. నాడు నిజాం, రజాకర్లకు వ్యతిరేకంగా జరిగిన సాయుధ పోరాటంలో గ్రామంలోని పలువురితో కలిసి నాన్న కూడా పాల్గొన్నాడు. గ్రామానికి నిజాం సైన్యం వచ్చినప్పుడు వారికి చిక్కకుండా పంటచేల్లో దాక్కున్న ఘటనలూ ఉన్నాయి. – **బత్తుల భూమన్న, గోట్కూరి గ్రామస్తుడు**

'సుడిగాల' అజ్ఞాత జీవనం..


సుడిగాల విశ్వనాథ సూరి(ఫైల్)

చెన్నూర్: చెన్నూర్ పట్టణానికి చెందిన సాయుధ పోరాట యోధుడు సుడిగాల విశ్వనాథ్ సూరి నిజాం నిరంకుశ పాలను వ్యతిరేకంగా పోరాటం సాగించాడు. నిజాం సర్కార్ నిర్బంధం పెరగడంతో రెండేళ్ల అజ్ఞాతం జీవించాడు. 1946లో సుభాష్ చంద్రబోస్ ఆధ్వర్యంలో మహారాష్ట్రలోని సిరోంచ గ్రామంలో ఏర్పాటు చేసిన రహస్య శిబిరానికి తరలివెళ్లారు. శత్రువులపై దాడి, మట్టి కరిపించడంపై ఏడాది పాటు శిక్షణ పొందారు. అనంతరం సిరోంచ నుంచి బల్లార్ష శిబిరానికి తరలించారు. 1947లో స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత జనజీవనంలోకి వచ్చారు.

చెన్నూర్ తొలి ఎమ్మెల్యే..

1952లో చెన్నూర్, లక్సెట్టిపేట ఉమ్మడి అసెంబ్లీ నియోజకవర్గాలకు జరిగిన ఎన్నికల్లో సోషలిస్ట్ పార్టీ తరఫున ఎమ్మెల్యేగా పోటీ చేసి గెలిచారు. 1952 నుంచి 57 వరకు పని చేశారు.

పోరాటయోధుడు 'గోపిడి'


గోపిడి గంగారెడ్డి

భైంసా: 'దొరలు దున్నాలి.. దొరసానులు పంటపొలాల్లో కలుపు తీయాలి...' అనే నినాదంతో గోపిడి గంగారెడ్డి ఆ రోజుల్లో గడీలపాలనకు వ్యతిరేకంగా పోరాటం చేశారు. అప్పట్లో ఈ ప్రాంతంలో దొరలపాలన ఉండేది. వారి పాలనలో ప్రతి ఒక్కరూ పనిచేసేవారు. గడీల్లో ఉండే దొరలు అందరిని తమ చేతిలో ఉంచుకుని పనులు చేయించుకునేవారు. వెట్టిచాకిరి మేమెందుకు చేయాలని ఆ రోజుల్లోనే దొరలకు తిరగబడి తన నినాదాన్ని బహిరంగంగా చెబుతూ పోరాటానికి పిలుపునిచ్చాడు. అప్పట్లో హైదరాబాద్ కేంద్రంగా నడిచిన నైజాం వ్యతిరేకపోరాటంలో పాల్గొన్నాడు. నైజాం ప్రభుత్వం ఆరునెలలు గోపిడి గంగారెడ్డిని ఆసిఫాబాద్ జైలులోనే ఉంచింది. పోచంపాడ్ గ్రామానికి చెందిన గోపిడి సాయవ్వ-గంగయ్య దంపతులకు ముగ్గురు ఆడ పిల్లలు, ఒక కుమారుడు. అందరిలో పెద్దవాడైన గంగారెడ్డి అప్పటి రజాకార్ వ్యతిరేకపోరాటంలో పాల్గొన్నాడు. ఎస్సారెస్పీ నిర్మాణంలో, పోచంపాడ్ ముంపునకు గురైంది. అక్కడి నుంచి లోకేశ్వరం మండలం గొడిసెర గ్రామానికి వచ్చి ఇక్కడే ఉండి పోరాటం కొనసాగించాడు. నిర్మల్–నాందేడ్ ప్రాంతాల్లో జరిగిన రజాకార్ వ్యతిరేకపోరాటంలో పాల్గొన్నాడు. గోపిడి గంగారెడ్డికి ముగ్గురు కుమారులు. 1952 నుంచి 1957 వరకు నిర్మల్ ఎమ్మెల్యేగా, 1957 నుంచి 1967 వరకు ముథోల్ ఎమ్మెల్యేగా పనిచేశారు. ఆయన మనువడు లోకేశ్వరం మండలం చింతకుంటకు చెందిన ప్రేమ్‌నాథ్‌రెడ్డి తాత వారసత్వంగా ఇప్పటికీ రైతు నాయకుడిగా ఉద్యమాల్లో పాల్గొంటున్నాడు.